క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా బట్టు లాలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన బుచ్చయ్య పదవి విరమణ పొందగా రెండు నెలలుగా ప్రిన్సిపాల్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఖమ్మంలో సీనియర్ లెక్చరర్‌గా పని చేసిన బట్టు లాల్ ప్రమోషన్‌పై కాటారం గురుకులానికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన నూతన ప్రిన్సిపాల్‌ను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

అవార్డుకు ఎంపిక

భూపాలపల్లి రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన సామల శ్రీధర్ రెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డుకు ఎంపికైనట్లు మనం ఫౌండేషన్ చైర్మన్, ఫౌండర్ డాక్టర్ బి చక్రవర్తి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల8న తెలంగాణ సరస్వతి పరిషత్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు.

'ఆరోపణలు సరికాదు'

భూపాలపల్లి అర్బన్: ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీపై డిప్యూటీ కలెక్టర్ల సంఘం పేరు మీద స్వయం ప్రకటిత జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి నాయకత్వంలో కొంత మంది వ్యక్తులు విష ప్రచార ఆరోపణలు చేయడం సరికాదని తెలంగాణ ఉద్యోగ గెజిటెడ్ టీచర్స్ పెన్షన్ అవుట్‌సోర్సింగ్ అండ్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ బూరుగు రవికుమార్, కో చైర్మన్ రేగూరి సుభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఖమ్మం వరద బాధితులకు సాయం కోసం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నిర్ణయం మేరకు ఉమ్మడి సంఘాల నిర్ణయంలో ఒక్క రోజు వేతనం విరాళంగా ప్రకటించడం జరిగిందన్నారు. కొందరు స్వార్థపరులు ఉద్యోగ వర్గానికి ద్రోహం చేసే విధంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దీనిని పూర్తిగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

ఎడ్యుకేషన్‌హబ్ ఘనత శ్రీధర్‌బాబుదే..

కాళేశ్వరం: అత్యంత వెనుకబడిన మంథని నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చిన ఘనత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకే దక్కుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018వ సంవత్సరంలో కాటారం మండలానికి మంజూరైన మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలను నాయకులు, అధికారుల నిర్లక్ష్యంతో సరైన వసతులు ఉన్న భవనం లేదన్న కారణంతో పెద్దపెల్లి జిల్లా వెంకటాపూర్‌లో 2019 సంవత్సరంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఆ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేయడంతో అధికారులు, మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకోని బీసీ గురుకుల పాఠశాలను కాటారంలో కొనసాగించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

బైండోవర్

కాళేశ్వరం: మహదేవపూర్ తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ ఎదుట జనగామ సరోజన అనే మహిళను ఎస్సై పవన్‌కుమార్ భూ సంబంధిత విషయంలో గురువారం బైండోవర్ చేశారు. ఆమెకు తహసీల్దార్ ఆరునెలలపాటు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, లేకుంటే రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి


ప్రవళిక (ఫైల్)

కాటారం: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ యువతి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తపల్లికి చెందిన బోగిరి ప్రవళిక(18) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స పొందుతూ మందులు వాడేది. పెద్ద ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని ఆర్థిక పరిస్థితుల కారణంగా వెళ్లలేదు. పలుమార్లు కడుపునొప్పి తీవ్రంగా రావడంతో ప్రవళిక నొప్పి భరించేకంటే చనిపోవడమే శరణ్యమని బాధపడేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో కడుపు నొప్పి తీవ్రతతో మనోవేదనకు గురైన ప్రవళిక గత నెల 29న ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 ద్వారా భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. చికిత్సను అందించిన వైద్యులు ప్రవళిక పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రవళిక బుధవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. గురువారం మృతురాలి తండ్రి రాజమొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

అనారోగ్యంతో రేషన్ డీలర్..

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ బజ్జూరి చంద్రమౌళి (80) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. డీలర్‌గా 30 సంవత్సరాల నుంచి ప్రజలకు సేవలు చేశారు.

భూపాలపల్లి అర్బన్: ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న విద్యార్థులు



టేకుమట్లలో..



మల్హర్‌లో..



రేగొండలో..





మొగుళ్లపల్లిలో..



మహాముత్తారంలో..

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


చిట్యాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


కాటారం: ధన్వాడ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంను సన్మానిస్తున్న విద్యార్థులు

చిట్యాల: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమావేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. మండలంలోని జూకల్ గ్రామంలో ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులకు చేయూత స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలిమారెడ్డి, సరళదేవి, బుర్ర సదయ్య, ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తి, శ్రీనివాస్, కృష్ణ, రాణి, మమత, చేయూత స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు మ్యాదరి సునీల్ పాల్గొన్నారు.

మల్హర్: డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ దేవి, ఉపన్యాసకులు, విద్యార్థులతో కలిసి రాధాకష్ణన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో గౌరవప్రదమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ఎం రవీందర్, ఉపన్యాసకులు నరేందర్, ప్రవీణ్, కరుణాకర్, స్వరూప రాణి, నరేష్, భరత్ రెడ్డి, జైపాల్, రవి, ఉమామహేశ్వరి, కళాశాల సిబ్బంది రవి, కిరణ్ పాల్గొన్నారు.

భూపాలపల్లి అర్బన్/టేకుమట్ల/రేగొండ(కొత్తపల్లి గోరి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువులను సన్మానించారు. పలువురు వక్తలు సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

టేకుమట్ల: ఉపాధ్యాయులే సమాజానికి దిక్సూచి అని మాతృశ్రీ ట్రస్టు చైర్మన్ దొంతుల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మాతృశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్లు అందించారు. ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డిపేట పీజీ ప్రధానోపాధ్యాయురాలు పద్మ, సుధాకర్, మేకల సదయ్య, గంపల స్వామి, వేల్పుల స్వామి, సోమిడి స్వామి, సంగి ప్రవీణ్, అండె కుమార్, మారెపెల్లి రాజకొంరయ్య, తిరుమలేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు రమేశ్, రేనుకుంట్ల శంకర్, బొజ్జపెల్లి ప్రభాకర్, సోమిడి తిరుపతి పాల్గొన్నారు.

కాటారం: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని పలువురు అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కేజీబీవీలో జీసీడీఓ శైలజ, కాటారం జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేకాధికారి సంజీవరావు, ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమారాణి, శ్రీదేవి, శైలజ, కరస్పాండెంట్లు జనగామ కార్తీక్‌రావు, వలుస వెంకటేశ్వర్లు, పృథ్వి పాల్గొన్నారు.

కాటారం(మహాముత్తారం): మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్‌తో పాటు మీనాజీపేట జెడ్పీహెచ్‌ఎస్, పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవ్‌సింగ్, రాంసింగ్, రజని, జ్యోతి, మంజుల పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో టీచర్స్‌డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మహదేవపూర్, కాళేశ్వరం ప్రభుత్వ పాఠశాలతో పాటు ప్రైవేట్ పాఠశాలు గ్రీన్‌వుడ్ పాఠశాల, సూరారం గ్రామంలోని ఎస్‌ఎస్‌వీఎం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి సత్కరించారు. శ్రీనివాసరెడ్డి, సుభాష్ చంద్రబోస్ ఉన్నారు.


చిట్యాల: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు


టేకుమట్ల: వెలిశాల ఉన్నత పాఠశాలలో...


టేకుమట్ల: శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో...


కాళేశ్వరంలో..

లింగాకర్షక బుట్టలపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గణపురం: వరిలో కాండం తొలిచే పురుగు (మొగిపురుగు) నివారణకు సేవా స్ఫూర్తి ఫౌండేషన్, జిల్లా వ్యవసాయ శాఖ, భారతీయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన లింగాకర్షక బుట్టలపై మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.గురువారం మండలంలోని పరుశరాంపల్లి తదితర గ్రామాల్లో మొగి పురుగు పర్యవేక్షణ, నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన నిర్వహించారు. రైతుల పొలాల్లో లింగకర్షక బుట్టలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్, ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌లో మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఈ పురుగు వలన గింజ తాలుగా ఏర్పడే ప్రమాదం ఉంటుందన్నారు. నూతన పరిజ్ఞానంతో లింగాకర్షక బుట్టలను తయారు చేయడం జరిగిందని ఇవి పంట కాలం మొత్తం పురుగుల ఉధృతి, తెలుసుకోవడంతో పాటు నివారణ కోసం వాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

భూపాలపల్లి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను మహిళలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత అన్నారు. గురువారం భూపాలపల్లి మండలంలోని గోర్లవీడులోని అంగన్‌వాగీ కేంద్రంలో జాతీయ పోషణ్ మాసం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పాలు, గుడ్లు, ఆకుకూరలు రోజువారి ఆహారంలో తీసుకోవాలని సూచించారు.

మొగుళ్లపల్లి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని సూపర్‌వైజర్ రజిత అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం పోషణ్ అభియాన్ మాసోత్సాల్లో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రజిత మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో లభించే పౌష్టికాహారం విధిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనిత, ఆశ వర్కర్లు స్వప్న, అరుణ తదితరులు ఉన్నారు.

రైతు ఆత్మహత్యలపై విచారణ


విచారణ చేపడుతున్న ఆర్డీఓ మంగీలాల్

మల్హర్: మండలంలో ఆయా గ్రామాల్లో త్రీసభ్య కమిటీ సభ్యులు రైతు ఆత్మహత్యలపై గురువారం విచారణ చేపట్టారు. మండలంలోని కుంభంపల్లి గ్రామానికి చెందిన పోచయ్య, పెద్దతూండ్ల గ్రామానికి చెందిన కొమురయ్య, మల్లంపల్లి గ్రామానికి చెందిన రవీందర్ అనే రైతులు గతంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సందర్భంగా రైతు ఆత్మహత్య పథకం కింద సదరు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించడానికి భూపాలపల్లి ఆర్డీఓ మాలోత్ మంగీలాల్ నాయక్ ఆత్మహత్యకుగల కారణాలను వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన కారణాలతో కుటుంబ సభ్యులు సంబంధిత ఆధారాలతో త్రిసభ్య కమిటీ ముందు విచారణకు హాజరు కావాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ రవికుమార్, వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

భూపాలపల్లి అర్బన్: ఇద్దరు గంజాయి విక్రయదారులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంపత్‌రావు వివరాలు వెల్లడించారు. గణపురం మండలం బస్వారాజుపల్లి గ్రామానికి చెందిన దాసరి రాములు, మిట్టపల్లి నిశాంత్‌లు ఆటోలో గంజాయి తీసుకువెళ్తున్నారని సమాచారంతో గణపురం ఎస్సై అశోక్ సిబ్బందితో కలిసి మండల పరిధిలోని రవినగర్ వద్ద గురువారం ఉదయం వాహనాలు తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆటోలో అనుమానాస్పదంగా కనిపించగా వాహనాన్ని తనిఖీ చేయగా సుమారు రెండు కేజీల ఎండు గంజాయి పట్టుబడినట్లు తెలిపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకోని విచారణ చేపట్టగా ఒరిస్సా రాష్ట్రంలో రమేశ్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఐ మల్లేష్, సిబ్బంది రాజు, నేతాజీ, శ్రీనివాసులు, యాకేశ్ పాల్గొన్నారు.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


చిట్యాల: కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: నిరుపేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళల అండగా ఉంటుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలో కేంద్రంలోని రైతు వేదికలో 20 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి-సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, మాజీ జెడ్పీటీసీ ఓరం సమ్మయ్య, నాయకులు దొడ్డి కిష్టయ్య, ఆర్‌ఐ రాజు, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ, మండలంలోని పలు గ్రామాలకు చెందిన మొత్తం 62 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఎంతో అండగా కల్యాణలక్ష్మి పథకం నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు, పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, పట్టణ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మితో పేదలకు భరోసా..

రేగొండ: కల్యాణలక్ష్మితో పేదలకు భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలకు చెందిన 81 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాంప్రసాద్‌రావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు ఓంప్రకాశ్, రాజేశ్వర్‌రావు, పున్నం రవి, వీరబ్రహ్మం, ఏనుగు రవీందర్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 28 లబ్ధిదారులకు గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ హుస్సేన్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింగరావు, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చెర్మన్ రఫీ, నాయకులు ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు, ఆకుతోట కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక


ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

చిట్యాల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకంలో భాగంగా 15 విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. 2023-24 సంవత్సరంలో గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు జరిగాయని డీఆర్పీ, ఎస్‌ఆర్పీలు చదివి వినిపించారు. కొన్ని గ్రామాలలో మస్టర్లు సక్రమంగా వేయకపోవడంతో పాటు కోలతలు తక్కువగా ఉన్నాయని , అలాగే పనికి రాకున్న వారికి మస్టర్లు వేశారని సమావేశంలో తెలిపారు. రాత్రి ఎనిమది గంటల వరకు కొన్ని గ్రామాలు పూర్తి అయ్యాయి. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎల్.విజయలక్ష్మీ, అడిషనల్ డీఆర్‌డీఓ వసుమతి, క్వాలీటి కంట్రోల్ అధికారి ధరమ్‌సింగ్, జిల్లా విజిలెన్స్ కమిటీ కన్వీనర్ రూబినా, అంబుష్‌మ్యాన్ శ్రీనివాస్, ఎంపీడీఓ రామకృష్ణ ఉన్నారు.

పొట్టకూటి కోసం వెళ్లి కానరాని లోకాలకు..

- ఆంధ్రా వరదల్లో మహాముత్తారం వాసి మృతి

కాటారం(మహాముత్తారం): పొట్టకూటి కోసం ఆంధ్రాకు వెళ్లి మృత్యు ఒడిలోకి వెళ్లాడు మహాముత్తారం మండల వాసి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉట్లపల్లికి చెందిన బీసుల లక్ష్మిరాజ్(19) కొంత కాలం క్రితం కూలి పని కోసం విజయవాడకు వలుస వెళ్లాడు. ఇదే క్రమంలో లక్ష్మిరాజ్ మరో నలుగురు తోటి కూలీలతో కలిసి నాలుగు రోజుల క్రితం ఫ్లెక్సీ తయారి దుకాణంలో ఉన్నారు. భారీ వర్షాల కారణంగా విజయవాడలో వరదల ప్రవహాం ముంచెత్తి వరద నీరు ఫ్లెక్సీ దుకాణంలోకి వచ్చాయి. దీంతో రాజుతో పాటు అప్రమత్తమైన కూలీలు సమీపంలోని ఫ్లై ఓవర్ ఎక్కడానికి ప్రయత్నించారు. నలుగురు కూలీలు సక్రమంగానే ఫ్లై ఓవర్‌పైకి చేరుకోగా వరద ప్రవహాం తీవ్రం కావడంతో రాజు వరదల్లో కొట్టుకొని పోయాడు. వరద ఉధృతి కొంత మేర తగ్గడంతో బుధవారం సాయంత్రం రాజు మృతదేహాం లభించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు విజయవాడకు వెళ్లి లక్ష్మిరాజ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. కాగా, మృతదేహాన్ని తీసుకొచ్చిన వారిలో నాయకులు లింగమల దుర్గయ్య, యూత్ నాయకులు కాల్వచర్ల రజాకర్, గావిడి కుమార్, మాడెం ప్రసాద్ ఉన్నారు. మృతుడి తండ్రి శంకర్ గతంలో మృతి చెందగా తల్లి, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు.

మండల కమిటీ ఎన్నిక

మల్హర్: మండలంలోని ఫొటో, వీడియో గ్రాఫర్స్ నాగులాంబిక అసోసియేషన్ ఆధ్వర్యంలో కొయ్యూరు నాగులమ్మ దేవాలయం వద్ద గురువారం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ మండల కమిటీ గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సలాది నవీన్, ఉపాధ్యక్షుడిగా ఆకుల సతీశ్, ప్రధాన కార్యదర్శిగా జక్కుల రమేశ్, కోశాధికారిగా అజ్మీరా శ్రీనివాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు పాలిశెట్టి నరేష్ కుమార్, జల్లారపు ప్రసాద్, దుండి రమేష్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


పలిమెల: చెక్కులు అందజేస్తున్న చంద్రశేఖర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ఆయన పీఏ ఆకుల చంద్రశేఖర్ 20 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి గురువారం పంపిణీ చేశారు. మహదేవపూర్, అంబట్‌పల్లిట, రావల్లికోట, ఎల్కేశ్వరం, కిష్టరావుపేట, సూరారం, కాళేశ్వరం, అన్నారం, తదితర గ్రామాల్లో ఆయన అందజేశారు.

పలిమెల: మండలంలోని సర్వాయిపేట, పంకెన, పలిమెల గ్రామాలలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వారికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి పీఏ ఆకుల చంద్రశేఖర్ గురువారం లబ్ధిదారుల గ్రామాలకు వెళ్లి నేరుగా కలిసి అందజేశారు.